## క్యాంపస్ అంబాసిడర్లు

# ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలి

- ఫ్లాష్ మాబ్‌ల ద్వారా అవగాహన కల్పించాలి
- 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య


కలెక్టరేట్‌లో విద్యార్థులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

ఖిలావరంగల్, అక్టోబర్ 28: క్యాంపస్ అంబాసిడర్లు ఎన్నికల్లో సైనికుల్లా పని చేయాలి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య కోరారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో క్యాంపస్ అంబాసిడర్‌గా గుర్తించిన విద్యార్థులతో ఓటరు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో బృందాలుగా ఏర్పడి, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. నామినేషన్ తేదీలోగా ఫాం-6 ద్వారా నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజుల్లో తమతమ కళాశాలల పరిసర ప్రాంతాల్లో విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలైన బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, మార్కెట్ పరిసరాల్లో ఫ్లాష్ మాబ్‌ల నిర్వహించి ఓటరు శాతాన్ని పెంచేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. గత ఎన్నికల్లో నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో పోలింగ్ 91 శాతం కాగా, తూర్పు నియోజకవర్గంలో 72 శాతం మాత్రమే జరిగిందన్నారు. అయితే, పోలింగ్ శాతం తగ్గడంలో యువత కారణమన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రజలు, యువకుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.

### ఓటు ప్రాధాన్యం తెలియజేయాలి

పోలింగ్ రోజు ప్రభుత్వం సెలవు ప్రకటించడం వల్ల కొంతమంది స్వప్రయోజనాల కోసం ఓటును నిర్లక్ష్యం చేసేందుకు ఆస్కారం ఉన్నందున జిల్లాలోని ప్రతి డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన సమావేశాలు ఏర్పాటు కలెక్టర్ చేయాలన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన ఓటుహక్కు ప్రాధాన్యాన్ని ప్రజలకు తెలియజేసి ఎథికల్ ఓటింగ్ జరిగేలా తమ వంతు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు.

### పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలు కల్పించాలి

ఎలక్షన్ కమిషన్ గైడ్‌లైన్స్ మేరకు మోడల్ పోలింగ్ స్టేషన్, యూత్ మేనేజ్ పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్స్ సునాయసంగా ఓటుహక్కు వినియోగించుకునేలా సౌకర్యాలు కల్పించామన్నారు. వారికి పోలింగ్ రోజు సహాయార్థం కళాశాలల్లోని 18 ఏళ్లలోపు ఉత్సాహవంతులైన విద్యార్థుల పేర్లు నమోదు చేస్తే కాలేజీ యాజమాన్యంతో మాట్లాడి వారి సహాయం తీసుకుంటామన్నారు. మొబైల్ ఉన్న ప్రతి విద్యార్థి సీ-విజిల్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, ఓటరును ప్రలోభాలకు గురి చేసే ఎలాంటి చర్యలైనా పంపించాలన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా తమ పేర్లు బహిర్గతం కాకుండా ఫిర్యాదు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు. సమావేశంలో స్విప్ నోడల్ ఆఫీసర్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి నరసింహమూర్తి, పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ బాలకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌రావు, నర్సంపేటలోని జయముఖి డిగ్రీ కాలేజీ, సిద్ధార్థ డిగ్రీ కాలేజీతోపాటు వివిధ పలు డిగ్రీ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### స్ట్రాంగ్ రూంలు తనిఖీలు

కాశీబుగ్గ: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ గోదాముల్లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచిన ఈవీఎంలను శనివారం వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తనిఖీ చేశారు. వివిధ రాజకీయం పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూం నుంచి ఎన్నికల సిబ్బందికి శిక్షణ కోసం నియోజకవర్గానికి 20 చొప్పున మూడు నియోజకవర్గాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కేటాయించారు.

### కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్ల పరిశీలన

ఏనుమాముల మార్కెట్‌లో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏర్పాట్లు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించిన డివిజన్ కేంద్రాల నుంచి పోలింగ్ మెటీరియల్ స్వీకరణకు రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లు, పోలింగ్ మెటీరియల్, పోలింగ్ బాక్స్‌లు, భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూంకు సీసీ కెమెరాలు, భద్రత ఏర్పాట్లు, కౌంటింగ్ నిర్వహణకు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి కౌంటింగ్ ఏజెంట్లకు ప్రవేశం, బారికేడింగ్, పార్కింగ్, మీడియా రూం ఇతర ఏర్పాట్లపై చర్చించి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం ఈవీఎంల స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత విధులు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలతో కలెక్టర్ సంభాషించి గట్టి నిఘా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో వాసు చంద్రా, ఎలక్షన్ సూపరింటెండెంట్ విశ్వనారాయణ, తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'మంచి నడవడికతో విధుల్లో రాణిస్తారు'


నవ్యకు పూలమొక్క అందజేస్తున్న గుండా ప్రకాశ్‌రావు

గిర్మాజీపేట, అక్టోబర్ 28: సత్ప్రవర్తన, క్రమశిక్షణ, మంచి నడవడిక కలిగిన వారు ఎక్కడ పని చేసినా విధుల్లో రాణిస్తారని ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘంలో విధులు నిర్వర్తించి వ్యక్తిగత కారణాలతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఉద్యోగిని నవ్యను శనివారం ప్రకాశ్‌రావు కార్యాలయ సిబ్బందితో కలిసి ఆర్ఎన్‌టీరోడ్‌లోని కార్యాలయ ఆవరణలో శాలువా కప్పి, పూలమొక్కతోపాటు వాసవీమాత విగ్రహాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది అజయ్, మంజుల, శ్రీలతాదేవి, ప్రవీణ, లావణ్య, రమాదేవి, పూజ, ప్రియాంక, రమ, సారంగపాణి పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

## టీబీపై అవగాహన కలిగి ఉండాలి

కరీమాబాద్, అక్టోబర్ 28: టీబీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూపర్‌వైజర్ సుభాషిణి అన్నారు. ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కరీమాబాద్‌లో శనివారం టీబీపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ టీబీ అంతం.. మనందరి పంతం కావాలన్నారు. ఆ దిశగా మనమంతా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం టీబీపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## బీఆర్ఎస్‌కు ముస్లింల అండ

కరీమాబాద్, అక్టోబర్ 28: బీఆర్ఎస్‌కు ముస్లింలు అండగా ఉన్నారని అండర్‌రైల్వేగేట్ ప్రాంతం మైనార్టీ నాయకుడు ఎంఏ జబ్బార్ అన్నారు. కరీమాబాద్‌లో పలువురు ముస్లింలు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జబ్బార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీలకు అండగా ఉన్నారన్నారు. బీఆర్ఎస్ గెలుపు కోసం ముస్లింలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ తూర్పులో నన్నపునేని నరేందర్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హసన్ అలీబేగ్, గౌస్, యాకూబ్ పాల్గొన్నారు.


ముస్లిం యువకులను ఆహ్వానిస్తున్న జబ్బార్

## 'బీజేపీ విధానాలతో దళితులపై దాడులు'


మాట్లాడుతున్న మారుపాక అనిల్‌కుమార్

ఖిలావరంగల్, అక్టోబర్ 28: బీజేపీ విధానాలతోనే దేశంలో దళితులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. శివనగర్ తమ్మెర భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సంఘీ ఏలెందర్ అధ్యక్షతన శనివారం దళిత సమ్మిట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర్య భారతంలో ఇంకా దళితులపై దాడులు జరుగుతుండడం శోచనీయమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగానికి గుండెకాయ వంటి ప్రజాస్వామ్యం, సామ్యవాదం అనే పదాలను రాజ్యాంగ ప్రవేశిక నుంచి తొలగించే కుట్రలను ఎన్డీఏ సర్కారు చేస్తున్నదని ఆరోపించారు. సమావేశంలో డీబీఎఫ్ కార్యదర్శి సుంచు రాజేందర్, బీకేఎం జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేశ్, సిలివేరి భిక్షపతి, జన్ను రవి, జాన్‌పాల్, రాచర్ల రాజేందర్, దేవరాజు, హరిబాబు, పైడి పాల్గొన్నారు.

## నన్నపునేనిని భారీ మెజార్టీతో గెలిపించాలి

ఖిలావరంగల్, అక్టోబర్ 28: బీఆర్ఎస్ వరంగల్ తూర్పు అభ్యర్థి నన్నపునేని నరేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బోగి సురేశ్ పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ 37వ డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో 229 బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వంద ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని నియమిస్తూ ప్రతి ఓటరును కలిసి సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే నరేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త శాయశక్తులా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి అరసం రాంబాబు, కన్వీనర్ ధర్మరాజు, శంభునిగుడి చైర్మన్ సిరబోయిన వాసుదేవ్, వేణు, అరుణ్, ప్రభాకర్, రవీందర్ పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బోగి సురేశ్

## విద్యతోనే భవిష్యత్‌కు భరోసా

- తల్లిదండ్రులు సమావేశాలకు విధిగా హాజరు కావాలి
- పిల్లల హోం వర్క్‌పై శ్రద్ధ పెట్టాలి
- ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలి
- రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

గిర్మాజీపేట, అక్టోబర్ 28: విద్యతోనే పిల్లల భవిష్యత్‌కు భరోసా ఏర్పడుతుందని రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. కృష్ణాకాలనీ హైస్కూల్‌లో హెచ్ఎం భూపాల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టీచర్స్-పేరెంట్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు సమావేశాలకు హాజరైనప్పుడే విద్యార్థులు సాధించిన ప్రగతి తెలుస్తుందని, ఇంటి వద్ద తమ పిల్లలు పాఠశాలల్లో ఇచ్చిన రాతపూర్వక పనులు చేస్తున్నారా లేదా చెక్ చేయాలన్నారు. పాఠశాలల్లో నిర్వహించే టీచర్స్-పేరెంట్స్ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు విధిగా హాజరు కావాలని కోరారు. ఎంఈవో విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభు త్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆర్జేడీ రాగి జావ తాగారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బండ్ల సురేందర్, ఉపాధ్యాయులు అఫ్సర్, రమేశ్, రవికుమార్, సందీప్‌కుమార్, సుభద్ర, శైలజ, సీఆర్పీ ప్రణీత, రాధాకృష్ణ పాల్గొన్నారు.

### పిల్లల చదువుపై శ్రద్ధ పెట్టాలి

పోచమ్మమైదాన్: పిల్లల చదువుపై ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రభుత్వ చార్‌బౌళి హెచ్ఎం ఎర్రబెల్లి నర్సింగరావు అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని ప్రభుత్వ చార్‌బౌళి ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఇంటి వద్ద టీవీలు, సెల్‌ఫోన్లకే పరిమితం చేయకుండా తల్లిదండ్రులు పిల్లల దృష్టిని చదువుపై మరల్చారన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం రాగి జావ అందజేస్తున్నామని వివరించారు. అలాగే, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంను ఉచితంగా అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతినెల చివరి శనివారం జరిగే పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు తల్లిదండ్రులు హాజరైతే పిల్లల చదువు విషయాలు తెలుస్తాయన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు కవిత, నీరజ, లక్ష్మి, సప్న, సుకన్య, హరికృష్ణ, బాలగంగాధరతిలక్, కె.రమేశ్, శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.